స్కెచ్

# ముహూర్తం ముందు

సి. ధర్మారావు

ఎల్లుండే పెళ్ళి. ఇల్లంతా సందడిగా, కోలాహలంగా వుంది. మగవాళ్ళు పందిళ్ళూ, అలంకారాల పనుల్లోనూ ఆడవాళ్ళు వంట అంచనాల్లోనూ నిమగ్నులై వున్నారు.

పెళ్ళికూతురు అనసూయ అప్పుడే తలంటు పోసుకుని పెరట్లో దానిమ్మచెట్టుదగ్గర సాయంకాలం నీరెండలో నిలబడి తల ఆరబోసుకుంటున్నది. ఇంటి ఆవరణలో ఇంకా ఎండవచ్చే ప్రదేశాలు చాలా వున్నా ఆ ప్రదేశంలోనే ఎండలో నిలబడటం ఆ అమ్మాయికి చాలా ఇష్టం. అదే ఆలోచిస్తున్నట్టు పెళ్లికూతురు... ఏమీలేదు, అక్కడ నిలబడితే పెరటి గుమ్మంలోంచి ఆ సందులో వచ్చేపోయేవాళ్లు కనపిస్తూవుంటారు. తన నల్లటి, నిడుపాటి ఆ కేశసంపదని చూసి, వాళ్లు లోలోపలైనా మెచ్చుకోవాలి తనని. వాళ్ళు లోలోపల మెచ్చుకుంటే నిజానికి తనకి ఒరిగేదేమీలేదు, అయినా తనకే దుకో అలా అని పిస్తుంది. మరి పెళ్ళాయిపోయి ముత్తయిదువనయితే బాగుండదు. అందులో ఎల్లుండే పెళ్లి...

ఒకసారి తాను లలితాంబగారింటికి కెళ్ళింది. వాళ్ళ వరండాలో చేరి నలుగురూ ఆ మధ్యాహ్నం ఏవేవో మాట్లాడుకుంటున్నారు. ఇంతలో వాళ్ళ నారాయణన్నయ్య ఇంట్లోకి వచ్చాడు. తను ఎటూ లేచి వెళ్ళటానికి వీలులేక సిగ్గుతో తలవంచేసుకుంది. కాస్సేపాగి బయటికెళ్లి పోతూ నారాయణ "బాబోయ్"అన్నాడు.

"ఏమిట్రా నీ గోల?"అంది లలితాంబ.

"గచ్చుమీద అజగరం బారుందిగదా, నల్ల త్రాచేమోనని జడుసుకున్నాను"అన్నాడు తన జడనుద్దేశించి. అందరూ నవ్వుకున్నారు. తనకి మరీ సిగ్గేసింది. కాని నోటమాట రాలేదు. ఏదో ఒకటి సమాధానం చెప్పాల్సింది. అలా చెప్పక పోయినందుకు తన్ను తాను తిట్టుకుంది తర్వాత. మాటకి మాట చెప్పకపోతే ఈ చదువుకున్న వాళ్లకి మరీ అలుసు. జుట్టు తడి ఆరుస్తున్నప్పుడల్లా తనకా సంగతి గుర్తొస్తుంది.

నారాయణ... నారాయణకీ తనకీ పెళ్ళవుతుందనుకున్నారసలు— ఈ మూడు నాలుగేళ్ళ నుంచీ. ఐనవాళ్ళూ ఈడూ జోడూ అని. నిజానికి తనెంత సరదాపడిందని? తీరా రెండునెల్ల కింద నాన్న వాళ్లు వెళ్ళడిగితే-ఏమిటో మరి-రెండు మూడేళ్ళదాకా అసలు పెళ్లి చేసుకోనన్నాడు. ఈ చదువుకున్న వాళ్ళ కెవరు చెప్తారు? నాన్నకి అభిమానమేసి ఇతర సంబంధాలు చూడటం మొదలుపెట్టాడు. ఆ వేళ తనకి పిచ్చెత్తినట్టయింది. ఆ రాత్రి ఏడుపొచ్చింది. ఏడుస్తూనే నిద్రపోయింది తను. మర్నాడు "ఈ రెండు మూడేళ్ళు ఆగకూడదూ?" అని అమ్మదగ్గిర అందామనుకుంది నాన్నకి తెలిసి ఏమంటాడో అని జంకి మళ్ళీ మానేసింది. వాళ్ళకీమాత్రం తన సుఖం సంగతి తెలియదా? ఏం బాగుంటుంది? అసలు అప్పాయమ్మకి మాత్రం నమ్మకమేమిటి?...కనకం బాగా లావుగా తయారయింది పాపం! దానికి తిండంటే అపేక్ష, ఎప్పుడూ ఏదో నవులుతూ వుంటుంది, వాళ్లవాళ్లు కొప్పడినా వినదు! ఇప్పుడేమో సంబంధాలువచ్చి దాన్ని చూసి తిరిగెళ్తున్నారు. ఇంకా నయం! తానుముందుగానే జాగ్రత్తగా వుండబట్టే గాని లేకపోతే తనుకూడా అలానే అయ్యేదేమో! అమ్మో...

ఓసారెప్పుడో లైబ్రరీనుంచి తమ్ముడిచేత పుస్తకము తెప్పించింది ఒకసారి. ఆ పుస్తకం పేరు "సంసార సుఖం" అందులో ఆ అమ్మాయి పేరు 'సోనియా' పాపం, తల్లీ తండ్రీ లేరు. ఒక చెల్లెలూ, ముసలమ్మా. వాళ్ళ ఆస్తి వ్యవహారాలు చూస్తున్నాడు వాళ్ళ తండ్రి స్నేహితుడొకాయన 'సోనియా' ఆయన్నే పెళ్ళిచేసుకుంది. మరి వాళ్ళదే దేశమో కాని పెళ్ళికాకముందే ఎన్నోసార్లు వాళ్ళు మాట్లాడుకున్నారు, కలిసి తిరిగారు. ఆడారు,

పాడారు. ఒకనాడు సోనియా వెన్నెలరాత్రిలో ఆయనతో కలిసి తోటంతా షికార్లు తిరిగింది. ఆ చిన్నమ్మాయి ఆయన్నెంత ఎక్కువ ప్రేమించిందో ఎన్నో పేజీలకి పేజీలు వర్ణనుంది ఆ పుస్తకంలో...మరి ఆ ప్రేమించడమేమిటో... తనకేం తెలియదు. ఒకవేళ నారాయణని తాను ప్రేమించటమే నేమో చేసింది? మరెప్పుడూ తాము మాట్లాడుకోలేదు, కలిసి తిరగలేదు, ప్రేమెట్లా అవుతుంది?...

పెళ్ళయాక కొన్నాళ్ళకి వాళ్ళేదో పట్నం వెళ్ళారు. ఇద్దరూ కలిసి కొన్నాళ్ళు, తరువాత సోనియా ఒంటరిగానూ ఎన్నో రాత్రి 'పార్టీ'లకి విందుభోజనాలకి వెళ్ళారు. మళ్ళీ వాళ్ళుగూడా ఎన్నో సార్లు కీచులాడుకున్నారు. అంత ప్రేమించుకున్న వాళ్లు పోట్లాడుకుంటారుకూడా కాబోలు! వాళ్ళు ఆడాళ్ళు, మగాళ్ళు అంతా కలిసే విందులకి వెళుతూవుంటారు. ఆ సోనియా తన అందంతో అక్కడి వారందరినీ ఆకర్షించేసింది. అందరూ ఆ అమ్మాయిని మెచ్చుకునేవారు. తరువాత కొందరా అమ్మాయి వెంటకూడా పడ్డారు... మళ్ళీ వాళ్లు ఆ పట్నం వదిలి పల్లెటూరుకు పోయాక అన్యోన్యంగా వున్నారు...అదంతా తనకి చాలా గమ్మత్తుగా వుంది, ఏ దేశమో వాళ్ళది..."మపాసా కథలు" అని ఇంకో పుస్తకం కూడా చదివింది తను, అందులోకూడా అంతే. ఆడా మగా అంతా కలిసే విందులు ఆరగిస్తారు. ఆ పుస్తకంకూడా ఆ దేశందే కాబోలు. మన వూళ్లల్లో అట్లా అందరూ కలవ రెందుకనో... ఎప్పుడో పెళ్ళి భోజనాలకి వెళ్ళినా ఆడాళ్ళకి ఆడాళ్ళే, మగాళ్ళకి మగాళ్ళే ఇదేమిటో... అందరూ నిజంగా కలిస్తే అదో గమ్మత్తుగా వుంటుంది. సోనియాకి మల్లే అందరూ తననీ, తన అందాన్నీ మెచ్చుకుంటారు, తనవంకే చూస్తుంటారు. అసలు వాళ్ళ లక్ష్మణా, భద్రం బహుశా తనదగ్గరే కూచుంటారు అస్తమానూ... తన వెంటకూడా పడ్తారు కాబోలు...పాడు! అసలు ఏమిటీ ఈ పిచ్చి ఆలోచన్లు తనకి! ఈ మూడేళ్ళనుంచీ రాజ్యలక్ష్మి పెళ్ళికి ఒకసారీ, అమ్మమ్మగారింటికి వెళ్ళినప్పుడోకసారీ తప్ప ఈ నాలుగుగోడల ఆవరణదాటి ఎక్కడికి వెళ్ళింది తను? ఒక్క కుర్రాడితోనైనా మాట్లాడిందా ఒక్క మాటన్నా, పాలేళ్ళతో తప్ప!...పెళ్ళి అయ్యాక ఇహ మిగతా జీవితమంతా అత్తవారింట్లో నాలుగు గోడలమధ్యా...! తనకి ఒక మరిదీ, ఒక ఆడబిడ్డాను. వాళ్ళు పాలేళ్లు, భర్త సంసారం, గేదెలూ! ఆ ఇంటి చుట్టూ నాలుగిళ్ళే తనకి ప్రపంచమంతా...అందుకే తను చదువుకున్నవాణ్ణి పెళ్ళాడాలని ఎంత వుబలాటపడింది? అతను వుద్యోగము చేస్తూ, బదిలీ అవుతూంటే తాను కూడా నాలుగూళ్ళు చూడొచ్చు! నారాయణ...నారాయణ నిజంగా తనని చాలా అన్యాయం చేశాడు! తనతో పెళ్ళిసంగతెవరన్నా పెద్దవాళ్ళు అతనిముందు ఎత్తితే కాదనీ, లేదనీ ఏమీ అనేవాడు కాదట. "అప్పటి మాటగదా" అనేవాడు నవ్వుతూ. తను ఎంత ఆశగా ఎదురు చూసింది అతనితో ఆ తన వివాహానికి! ఆ కానియ్, నారాయణకా పుసుకు తగలకుండా పోతుందా? చదువుకున్నవాళ్ళమని ఎంత గర్వం!

పోనీ, ఆ కొత్తగూడెం సంబంధం అన్నా కుదరగూడదూ, అతను యస్. ఏ. చదువుతున్నాడట. ఇంటికొచ్చి స్థితిగతులు చూశారు. అతను తనని చూశాడు. కట్నాలు తెలుసుకున్నారు. ఇంటికెళ్లి ఇంకా కట్నం మూడు వేలు పెంచితే చేసుకుంటామని వుత్తరం! నాన్నకి మండిపోయింది. కట్నం విషయంలో సంశయమున్న వాళ్లు పిల్లని చూడటమెందుకా? అని. "వాడు చదువుకున్నవాడా, రెండుకాళ్ళ పశువుగాని" అని తిట్టాడు నాన్న. నిజమే మరి...అసలీ చదువుతున్న వాళ్ళంతా ఇంతే. వీళ్ళని చేసుకోనే కూడదు. తనకి తెలియక చాల హైరానపడింది. నాయనమ్మ అంటుంది "అంతా బెమ్మరాత! ఏ బొమ్మకి ఏ బొమ్మ రాసిపెట్టిందో!" అని. ఇప్పుడీ సంబంధానికేం? పన్నెండు యెకరాలు మాగాణి. ఎప్పుడూ కంటి కెదురుగా వుంటాడు. నిదానస్తుడు. తన అమ్మా నాన్నలకి తెలియదూ తన సుఖం సంగతి, అంతా తన పిచ్చిగాని...